# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 11, మే 2026


### వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ

# వేగవంతం చేయాలి

**✪ మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

దండేపల్లి, ప్రభాతవార్త



జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. ఆదివారం జిల్లాలోని దండేపల్లి మండలం తాళ్లపేట్, నాగసముద్రం, మాకులపేట్, లింగాపూర్, మామిడిపల్లి1, మామిడిపల్లి2, దండేపల్లి వరి కొనుగోలు కేంద్రాలు, లింగాపూర్ గోదాంను ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం లోడింగ్ పనులను మరింత వేగవంతం చేయాలని, రైతులు ఎక్కువసేపు నిరీక్షించకుండా వెంటనే లారీలలో లోడింగ్ పూర్తి చేయాలని తెలిపారు. ఎలాంటి అలసత్వం లేకుండా కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని, సంచులను నిర్దేశిత సామర్థ్యానికి అనుగుణంగా నింపాలని, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు మిగతా 2లో..

# విద్యా వారోత్సవాలు జూన్‌లో నిర్వహించాలి

**✪ ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డిమాండ్**

జన్నారం, మే 10, ప్రభాతవార్త

రాష్ట్రంలో ఈనెల 11వ తేదీ నుంచి జనగణన కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో, అదే రోజు విద్యా వారోత్సవాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేయడంపై తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేష్ నాయక్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం రోజున ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా నిర్వహించే విద్యా వారోత్సవాలను జూన్ రెండో వారంలో నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. దాదాపు 90 శాతం మంది ఉపాధ్యాయులు జనగణన విధుల్లో నిమగ్నమై ఉన్నారని, ముఖ్యంగా ఏకోపాధ్యాయ పాఠశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో సమస్య తలెత్తుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా బడి బాటను జూన్ మొదటి వారంలో నిర్వహించాలని, జనగణన విధులు కేటాయించబడిన ఉపాధ్యాయులను కాకుండా వేరే వారిని వారోత్సవాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖకు సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ అంశంపై పునరాలోచన చేయాలని ఆయన కోరారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నిబంధనలు పాటించాలి

**✪ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

లక్షెట్టిపేట, మే 10, ప్రభాతవార్త



జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నిబంధనలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. ఆదివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం ఇటిక్యాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల తహసీల్దార్ దిలీప్ కుమార్, మండల వ్యవసాయ అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలులో నెలకొన్న సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతుల వద్ద గల ధాన్యంను నిబంధనల ప్రకారం పరిశీలించి కొనుగోలు చేయాలని, కొనుగోలు అనంతరం గోదాములకు, రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల తహసీల్దార్ దిలీప్ కుమార్, మండల వ్యవసాయ అధికారి లతో కలిసి మండలంలోని కొనుగోలు కేంద్రాల నిర్వహకులతో ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ అంశాలపై సమీక్షించారు. అకాల వర్షాల కారణంగా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని తడవకుండా రైతుల సంక్షేమంలో భాగంగా గోదాములలో నిలువ చేయడం జరుగుతుందని, లారీలు, అందుబాటులో ఉన్న ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, గోదాముల సామర్థం, హమాలీల సంఖ్యను పూర్తిగా వినియోగిస్తూ నిల్వలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లులు, లారీలు, హమాలీలు, కొనుగోలు కేంద్రాల్లో తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హమాలీల కొరత.. రైతన్నల వెత



- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన వడ్ల నిల్వలు
- హమాలీలు లేక కొనుగోళ్లు ప్రారంభించని సెంటర్లు పదుల సంఖ్యలోనే
- నియోజకవర్గంలో ఇప్పటివరకు 25 శాతం దాటని కొనుగోళ్లు
- ఎండా, వానలకు సెంటర్ల వద్ద కర్షకుల పడిగాపులు

2లో..

– చెన్నూరు, మే 10, ప్రభాతవార్త

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. దండేపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం యంత్రాల కొరతపై స్పందించి బెల్లంపల్లి ఏఎంసీ గోదాం నుండి కొత్త తూకం యంత్రాలను వెంటనే తెప్పించాలని నిర్వాహకులకు సూచించారు. మండలంలోని వరి కొనుగోలు కేంద్రాలకు అవసరమైన లారీలు అందుబాటులో ఉండేలా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సమన్వయంతో తీసుకోవాలని జిల్లా రవాణా అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, తహసిల్దార్ రోహిత్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, మండల పంచాయతీ అధికారి విజయ్ ప్రసాద్, డీపీఎం శంకరయ్య, ఏపీఎం, స్థానిక సర్పంచ్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హమాలీల కొరత.. రైతన్నల వెత

**చెన్నూరు, మే 10, ప్రభాతవార్త**

ఆరుగాలం శ్రమించి పండించిన వడ్లను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో పోసినప్పటి నుంచి రైతులకు కష్టాలు ఎదురవుతున్నాయి. జిల్లాలోని చెన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ, హమాలీల కొరత వలన కొనుగోళ్లు లేక కేంద్రాలు వెలవెల బోతున్నాయి. ఒకవైపు వర్షాలకు వడ్లు తడవకుండా రాత్రింబవళ్లు కళ్ళల్లో వత్తులేసుకుని పంటను కాపాడుకుంటున్న కర్షకులు, తమ వడ్లను కొనుగోలు చేయక పోవడంతో కేంద్రాల వద్ద రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. చెన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు పాతిక శాతం కూడా గొనుగోల్లు జరగక పోవడం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు గ్రామాల్లోని కొన్ని కొనుగోలు కేంద్రాలు ఇప్పటివరకు కొనుగోళ్లు మొదలు కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.




## కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరిన హనుమాన్ దీక్ష భక్తులు

**జన్నారం, మే 10, ప్రభాతవార్త**

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి బాదంపల్లి గ్రామానికి చెందిన హనుమాన్ దీక్ష భక్త బృందం ఆదివారం రోజు సాయంత్రం బయలుదేరి వెళ్లారు. చేతిలో జెండాలు పట్టుకుని జై శ్రీరామ్ నినాదాలతో స్వాములు ఉత్సాహంగా కదిలారు. గ్రామంలోని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. మాల ధరించిన సుమారు 20 మంది స్వాములు ఈ యాత్రలో పాల్గొన్నారు. కొండగట్టు క్షేత్రానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటామని వారు తెలిపారు.

## జిల్లా ఎరువుల వ్యాపారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

**ఆసిఫాబాద్ టౌన్, మే 10, ప్రభాతవార్త :**



కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎరువుల వ్యాపారుల సంఘం ఎన్నికల్లో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక వాసవీ భవనంలో సంఘ సభ్యుల సమక్షంలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా కాచం నాందేవ్, గౌరవ అధ్యక్షుడిగా తాటిపల్లి వినోద్, ఉపాధ్యక్షులుగా ఎస్ రాజన్న, అవనిదర్ గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా ప్రకాష్, విశాల్, ఖలీద్ బిన్ యాఫై సంయుక్త కార్యదర్శులుగా లక్ష్ముుుు మ్రణ్, సంతోష్, మహేష్ కోశాధికారికారులుగా టి ఆశిష్, టి గిరీష్ కార్యవర్గ సభ్యులుగా రామకృష్ణ, శివకుమార్, బి తిరుపతి, సాగర్, ఏ తిరుపతి స్పోక్స్ పర్సన్‌గా తిరుపతిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గంకు సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ నూతన అధ్యక్షుడుగా జిల్లా వ్యాప్తంగా ఎరువుల వ్యాపారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని, వ్యాపారుల హక్కుల పరిరక్షణకు సంఘం ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. అదేవిధంగా సంఘ బలోపేతానికి ప్రతి సభ్యుడు సహకరించాలని కోరారు. అనంతరం సంఘం నాయకులు నూతన అధ్యక్షుడితో పాటు కార్యవర్గం సభ్యులను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, వ్యాపారులు పాల్గొన్నారు.

## 1857 స్వాతంత్ర్య సంగ్రామ వీరులకు ఘన నివాళులు

**మందమర్రి, మే 10, ప్రభాతవార్త**



1857 సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ మందమర్రి పట్టణంలోని మాజీ ఆర్మీ జవాన్, ప్రస్తుత ఎస్ అండ్ పీసీ ఉద్యోగి రాజేష్ పీవీ హాల్, రాణి పీవీ హాల్ దంపతులు ఆదివారం తమ నివాసంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1857 సిపాయిల తిరుగుబాటు భారతదేశ చరిత్రలో మరుపురాని అధ్యాయమని పేర్కొన్నారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరుల ధైర్యసాహసాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. 1857 మే 10న మీరట్‌లో సిపాయిలు బ్రిటిష్ అధికారులకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభించగా, అది దేశవ్యాప్తంగా వ్యాపించి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా చరిత్రలో నిలిచిందని తెలిపారు. ఈ పోరాటంలో మంగళ్ పాండే, రాణి లక్ష్మీబాయి, బహదూర్ షా జఫర్, నానా సాహెబ్, తాంతియా తోపే, కున్వర్ సింగ్ వంటి మహానాయకులు బ్రిటిష్ పాలనకు ధీటుగా ఎదిరించి పోరాడారని గుర్తుచేశారు. బ్రిటిష్ వారి అణచివేత, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా భారతీయ సిపాయిలు తమ ఆత్మగౌరవం కోసం చేసిన ఈ పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నాంది పలికిందని పేర్కొన్నారు. ఈ తిరుగుబాటు అనంతరం బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనకు ముగింపు పలికి, భారత స్వాతంత్ర్య పోరాటం కొత్త దిశగా సాగిందన్నారు. దేశ స్వేచ్ఛ కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## తాండూర్ ఐబీలో మజ్జిగ పంపిణీ

**తాండూర్, మే10, ప్రభాతవార్త :**

తాండూర్ మండలంలోని ఐబిలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంచిర్యాల డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి దంపతుల పెళ్లిరోజును పురస్కరించుకొని మజ్జిగ పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కుషనపల్లి లక్ష్మణ్, మడావి ప్రభాత్ రావు, తిరుపతి, ఆకుల వెంకటేష్, నాయకులు కాపర్తి సుభాష్, మామిడాల రాజేశం, పేరం శ్రీనివాస్, పెద్ద బోయిన శంకర్, పుట్ట శ్రీనివాస్, శంకరమ్మ, కట్కల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



# వినికిడి తగ్గితే.. మానసిక ఒత్తిడి పెరుగుతుంది..!



- చెవులు వినబడకపోతే.. జీవితమే నిశ్శబ్దం!
- ఇయర్‌ఫోన్స్ మోత.. యువత చెవులకు ముప్పు!
- వినికిడి కోల్పోతే.. తిరిగి పొందడం కష్టం!
- చెవుల్ని కాపాడుకోండి.. లేదంటే లోకం మూగబోతుంది!
- యువతలో పెరుగుతున్న వినికిడి సమస్యలు!
- టిన్నిటస్ నుంచి హియరింగ్ లాస్ వరకు.. నిర్లక్ష్యం ప్రమాదం!
- ఇయర్‌ఫోన్స్ అధిక వినియోగం.. చెవులకు శాశ్వత నష్టం!
- సైలెంట్‌గా వస్తున్న ప్రమాదం.. వినికిడి లోపం!
- వినికిడి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు నవ్య హియరింగ్ అండ్ స్పీచ్ క్లినిక్ చీఫ్ ఆడియాలజిస్ట్ డా. సతీష్ సకినాలతో ప్రత్యేక ఇంటర్వ్యూ

నిర్మల్, మే 10, ప్రభాతవార్త:

**మారుతున్న జీవనశైలి, అధిక శబ్ద కాలుష్యం, ఇయర్‌ఫోన్ల అధిక వినియోగం కారణంగా యువతలోనే వినికిడి సమస్యలు పెరుగుతున్నాయని నవ్య హియరింగ్ అండ్ స్పీచ్ క్లినిక్ చీఫ్ ఆడియాలజిస్ట్ డా. సతీష్ సకినాల తెలిపారు. వినికిడి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే మానసిక ఒత్తిడి, ఒంటరితనం, డిప్రెషన్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. "వినికిడి విలువ – తెలుసుకుందాం" అనే అంశంపై "ప్రభాతవార్త"తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు...**




## ప్రస్తుతం వినికిడి సమస్యలు ఎందుకు పెరుగుతున్నాయి?

గతంలో 45 ఏళ్లు దాటిన తర్వాత కనిపించే వినికిడి సమస్యలు ఇప్పుడు 20 ఏళ్ల వయసులోనే వస్తున్నాయి. ముఖ్యంగా యువతలో ఇయర్‌ఫోన్ల అధిక వినియోగం ప్రధాన కారణం. డబ్ల్యూహెచ్‌వో సూచనల ప్రకారం 60 వాల్యూమ్‌తో రోజుకు 60 నిమిషాలకంటే ఎక్కువ వినకూడదు. కానీ చాలామంది 80-90 వాల్యూమ్‌తో గంటల తరబడి వినడం వల్ల చెవిలోని సున్నితమైన నరాలు దెబ్బతింటున్నాయి.

## వినికిడి లోపాన్ని ఎలా గుర్తించాలి?

టీవీ వాల్యూమ్ ఇతరులకు ఎక్కువగా అనిపించి మీకు తక్కువగా అనిపించడం, గుంపులో మాట్లాడే మాటలు స్పష్టంగా వినిపించకపోవడం, చెవిలో ఎప్పుడూ హోరుమనే శబ్దం (టిన్నిటస్), ఫోన్ మాట్లాడేటప్పుడు చెవి మార్చడం వంటి లక్షణాలు వినికిడిలోపానికి సంకేతాలు కావచ్చున్నారు. ఇలాంటి సమస్యలు ఉంటే వెంటనే ఆడియోమెట్రీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

## ఇయర్‌ఫోన్స్ వాడకంపై సూచనలు..

ఇయర్‌ఫోన్స్ పూర్తిగా మానేయడం సాధ్యం కాకపోయినా సేఫ్ లిజనింగ్ అలవాటు చేసుకోవాలని డాక్టర్ సూచించారు. 60/60 రూల్ పాటించాలి. నాయిస్ క్యాన్సలింగ్ హెడ్‌ఫోన్స్ ఉపయోగించాలి. ప్రతి గంటకు 5 నిమిషాలు చెవులకు విశ్రాంతి ఇవ్వాలి. ఒకసారి వినికిడి శక్తి తగ్గితే పూర్తిగా తిరిగి సాధించడం కష్టమని, అందుకే ముందస్తు జాగ్రత్తలే ఉత్తమమన్నారు. నవ్య క్లినిక్‌లో అందుబాటులో ఉన్న సేవలునవ్య హియరింగ్ అండ్ స్పీచ్ క్లినిక్‌లో అత్యాధునిక పరీక్షలు, హియరింగ్ ఎయిడ్స్, స్పీచ్ థెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిజిటల్ ఆడియోమెట్రీ, టింపనోమెట్రీ పరీక్షలు బ్లూటూత్ సదుపాయం ఉన్న డిజిటల్ హియరింగ్ ఎయిడ్స్ టిన్నిటస్ మేనేజ్‌మెంట్ థెరపీచిన్నారుల కోసం ప్రత్యేక స్పీచ్ థెరపీ



## హియరింగ్ ఎయిడ్స్ ధరలు ఎలా ఉంటాయి?

ప్రస్తుతం రూ.8 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు వివిధ రకాల హియరింగ్ ఎయిడ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బేసిక్ డిజిటల్ పరికరాలు రూ.1520 వేల మధ్య లభిస్తాయని, ఐదేళ్ల గ్యారెంటీతో పాటు ఈఎంఐ సదుపాయం కూడా ఉంటుందని చెప్పారు. చిన్నారుల్లో వినికిడిలోపం పిల్లలు 6 నెలల వయసులో శబ్దాలకు స్పందించకపోయినా, పేరు పెట్టి పిలిస్తే తిరిగి చూడకపోయినా వెంటనే పరీక్ష చేయించాలన్నారు. 3 ఏళ్లలోపు చికిత్స ప్రారంభిస్తే చాలా మంది పిల్లలు సాధారణ పాఠశాలల్లో చదివే స్థాయికి వస్తారని తెలిపారు. ప్రజలకు సందేశంవినికిడి సమస్యలను సిగ్గు, బెరుకు కారణంగా దాచిపెట్టకుండా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏటా ఒకసారి వినికిడి పరీక్ష చేయించుకోవాలని కోరారు. ఇటీవల 28 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రోజుకు 8 గంటలు ఇయర్‌ఫోన్స్ వినడం వల్ల 40 శాతం వినికిడి లోపానికి గురయ్యాడని, ప్రస్తుతం హియరింగ్ ఎయిడ్, సౌండ్ థెరపీతో సాధారణ జీవితానికి వచ్చాడని తెలిపారు. వృద్ధులకే వినికిడి సమస్యలు వస్తాయి అనేది ఒక అపోహ మాత్రమే. మారుమూల ప్రాంత ప్రజలకు సైతం నిర్మల్ జిల్లా కేంద్రంలో సాహితుకమైన ఖర్చుతో అందరికీ అందుబాటులో నవ్య హియరింగ్ అండ్ స్పీచ్ క్లినిక్ అందుబాటులో ఉంది. అప్పల నరసయ్య కాంప్లెక్స్, డాక్టర్స్ లైన్, ఫస్ట్ ఫ్లోర్, స్టేట్ బ్యాంక్ పైన, నిర్మల్. ఉచిత స్క్రీనింగ్ క్యాంప్ ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.








అడెల్లి పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర విత్తన కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి దంపతులు

## అడెల్లి పోచమ్మను దర్శించుకున్న రాష్ట్ర విత్తన కార్పొరేషన్ చైర్మన్

సారంగాపూర్, మే 10, ప్రభాతవార్త:

మండలంలోని అడెల్లి మహా పోచమ్మ అమ్మవారిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర విత్తన కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ భోజాగౌడ్, కార్యనిర్వాహణాధికారి భూమయ్య సాదరంగా స్వాగతం పలికారు. అన్వేష్ రెడ్డి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆలయ చైర్మన్ ఊట్ల రాజేశ్వర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాదానికి గురైన బైక్, ఆర్టీసీ బస్సు

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

సారంగాపూర్, మే 10, ప్రభాతవార్త:

మండలంలోని సోనాపూర్ తాండాకు చెందిన సబ్లే అజయ్ (21) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అజయ్ ఆదివారం ఉదయం తన బైక్‌పై వ్యవసాయ పనుల నిమిత్తం డీజిల్ కోసం చించోలి(బి) ఎక్స్ రోడ్డు వద్ద గల పెట్రోల్ బంకుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. మహిళా ప్రాంగణం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు అతివేగంగా మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తూ వచ్చి అజయ్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అజయ్ కింద పడటంతో కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే 108 అంబులెన్స్ ద్వారా నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ పరశురాం వాగ్మారేపై దర్యాప్తు చేస్తున్నారు.

## 12న బ్రహ్మంగారి ఆలయం ఏడవ వార్షికోత్సవం

ఆసిఫాబాద్, మే 10, ప్రభాతవార్త :

జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఏడవ వార్షికోత్సవం ఈ నెల 12న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ప్రత్యేక పూజలు మధ్యాహ్నం 12:30 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనునట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## నీటి సరఫరా పునరుద్ధరించకుంటే జీఎం కార్యాలయం ముట్టడి

**- శ్రీరాంపూర్‌లో నీటి ఎద్దడిపై ఏఐటీయూసీ హెచ్చరిక**

నస్పూర్, మే 10, ప్రభాతవార్త

శ్రీరాంపూర్ కాలనీ, ఆర్.కె 8, గాంధీ నగర్ కార్మిక వాడల్లో గత నాలుగు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంపై ఏఐటీయూసీ నాయకులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బాజీ సైదా ఆదివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సార్పీ 1 గనిలో పంపులు మునిగినందున నీటి సరఫరా ఆగిందని యాజమాన్యం చెబుతున్నప్పటికీ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. కార్మిక కుటుంబాలు తాగునీటి కోసం అల్లాడుతుంటే యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో కార్మిక కుటుంబాలతో కలిసి జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

# ప్రధాని మోదీ సభకు తరలిన బీజేపీ నాయకులు

చెన్నూర్, మే 10, ప్రభాతవార్త

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం రోజు హైదరాబాద్‌లో నిర్వహించే సభకు చెన్నూరు మండలం తో పాటు వివిధ గ్రామాల నుంచి భాజపా శ్రేణులు బస్సుల్లో తరలి వెళ్లారు. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో చెన్నూరు మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్, స్థానిక కౌన్సిలర్ ఏతం శివకృష్ణ, నాయకులు తుమ్మ శ్రీపాల్, గర్రెపల్లి వెంకట్ నర్సయ్యతో పాటు పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు, తరలివచ్చారు.



నర్సాపూర్(జి), మే 10, ప్రభాతవార్త:

హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు నర్సాపూర్ మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బర్కుంట నరేందర్ మాట్లాడుతూ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి రాష్ట్రానికి వస్తున్న మోదీ పర్యటనతో కార్యకర్తల్లో నూతనోత్తేజం నెలకొందన్నారు. ఇటీవల మూడు రాష్ట్రాల ఎన్నికల విజయం తర్వాత కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అర్జున్ సింగ్, మాజీ కార్యదర్శి రాజేందర్, సర్పంచ్ ప్రవీణ్, పల్లపు రాజు, దూసముడి సవీన్, సాయికృష్ణ, దత్తూరాం, నారాయణ, రాజు, నరేష్, శివ, అశోక్ పాల్గొన్నారు.

వేమనపల్లి, మే 10, ప్రభాతవార్త

భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం రోజు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే సభకు మండల భాజపా అధ్యక్షులు ఏట రవి కుమార్ ఆధ్వర్యంలో భాజపా శ్రేణులు బస్సుల్లో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు కొప్పుల చరణ్ రాజ్, ఎనుముల వెంకటేష్, భాజపా నాయకులతో పాటు పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు, తరలివెళ్లారు.





## ఘనంగా వేణుగోపాలచారి జన్మదిన వేడుకలు

సారంగాపూర్, మే 10, ప్రభాతవార్త:



మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి జన్మదిన వేడుకలను ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధాశ్రమంలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కీర్తిని దేశవ్యాప్తంగా చాటిన గొప్ప వ్యక్తి వేణుగోపాలచారి అని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎంబడి రాకేష్, దేవరకోట దేవస్థానం మాజీ చైర్మన్ ఆమోద శ్రీధర్, తెలంగాణ ఎన్నారై అడ్వైజరీ కమిటీ సభ్యులు స్వదేశ్ పరిగిపండ్ల, కాంగ్రెస్ నాయకులు విజ్ఞాతేజ, ఆకుల నర్సయ్య పాల్గొన్నారు.

## వడూర్ ప్రీమియర్ లీగ్ విజేతలకు బహుమతుల ప్రధానం

నేరడిగొండ, మే 10, ప్రభాతవార్త:



మండలంలోని వడూర్ గ్రామంలో నిర్వహించిన వడూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వడూర్ రైడర్స్ జట్టుకు రూ. 20,000, ద్వితీయ స్థానంలో నిలిచిన బ్లాక్ బాస్టర్స్ జట్టుకు రూ. 10,000 నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు ఎండల పట్ల జాగ్రత్తలు పాటిస్తూ క్రీడల్లో రాణించాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ పండరీ, సుజీల్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.



## కార్యదర్శి కైలాష్‌కు ఘనంగా వీడ్కోలు

జైనూర్, మే 10, ప్రభాతవార్త:

జైనూర్ మండలం పానాపటార్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా గత రెండేళ్లుగా విధులు నిర్వర్తించిన జాడి కైలాష్ కౌటాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆత్రం తులసి, ఉపసర్పంచ్ భీంరావ్, వార్డు సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కైలాష్ అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. బదిలీలు ఉద్యోగంలో భాగమేనని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బాపురావు, వినాయక్ రావ్, భీంరావ్, జ్యోతిరాం, దత్తరాం, అభినాథ్, రాందాస్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఘన సన్మానం

నేరడిగొండ, మే 10, ప్రభాతవార్త:

ఢిల్లీలో అమెరికన్ యూనివర్సిటీ ద్వారా సోషల్ సర్వీస్ విభాగంలో గౌరవ డాక్టరేట్ అందుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆదివారం ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు. సమాజ సేవలో ఆయన చేస్తున్న కృషికి ఈ గుర్తింపు లభించడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. తనను అభినందించిన కళాశాల బృందానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

**బెల్లంపల్లి, మే 10, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతంగా అమలు అవుతోంది. ఈ పథకం ద్వారా సొంత ఇల్లు లేని అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి శాశ్వత గృహం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ సందర్భంగా గురజాల గ్రామపంచాయతీకి చెందిన డాకూరి సురేష్ నూతన గృహప్రవేశ మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరై వారి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామ్ చందర్, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, గురజాల సర్పంచ్ వంగ రామన్న, లంబాడి తండా సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్, తోట నరేష్, ఆరేపల్లి సురేష్, యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బాలు యాదవ్ మరియు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## గంగపుత్ర మత్స్య సహకార సంఘం నూతన కమిటీ ఎన్నిక

**జన్నారం, మే 10, ప్రభాతవార్త**

జన్నారం మండలం తపాల్‌పూర్ సింగరాయిపేట గ్రామంలోని గంగపుత్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తపాల్‌పూర్‌లోని సంఘ ఆవరణలో జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షులుగా శాఖపురం రాజయ్య, ఉపాధ్యక్షులుగా శాఖపురం కిష్టయ్య, కార్యదర్శిగా శాఖపురం రాజన్న ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా శాఖపురం కోటయ్య, గుమ్ముల శంకరయ్య, కొండ్ర లచ్చయ్య, కొండ్ర కొండయ్య, కొండ్ర రాజయ్య, శాఖపురం రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నీరటి రాజేశ్వరి ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు శాఖపురం రాజయ్య మాట్లాడుతూ, చెరువు, గోదావరి నదిలో చేపల వేట ద్వారా ఉపాధి పొందేందుకు తమ సహకార సంఘ సభ్యులందరికీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కుల పెద్దలు, గ్రామస్తులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూటీపై నుంచి పడి యువకుడు మృతి

**లక్షెట్టిపేట, మే 10, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట బస్టాండ్ సమీపంలో ఆదివారం ఉదయం ఎలక్ట్రిక్ స్కూటీ పై నుంచి పడి లక్షెట్టిపేట బాబురావు వాడకు చెందిన జగటాల కమల్ (39) మృతి చెందాడు. మృతుడు రోజు మాదిరిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకింగ్‌కి వెళ్లి తిరిగి తన ఎలక్ట్రిక్ స్కూటీపై ఇంటికి వస్తుండగా ఒక్కసారిగా కళ్ళు తిరిగి కింద పడిపోవడంతో తలకు గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల తరలిస్తుండగా మార్గమధ్యలో ఇటిక్యాల వద్ద అంబులెన్స్‌లో ఎంత పిలిచిన పలకకపోవడంతో అంబులెన్స్‌ను తిరిగి లక్షెట్టిపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి వైద్యులు కమల్‌ని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి తల్లి, భార్యతోపాటు ఇద్దరు చిన్న పిల్లలు సంతానం కలరు. మృతుని భార్య అర్చన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అన్వర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం జరుగుతుంది.

## వీగంలో రూ.50 లక్షల సీసీ రోడ్డు ప్రారంభం

**బెల్లంపల్లి, మే 10, ప్రభాతవార్త**



బెల్లంపల్లి నియోజకవర్గంలోని భీమిని మండల వీగం గ్రామ పంచాయితీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామాల్లో నాణ్యమైన రహదారి సదుపాయాలు కల్పించడం వల్ల ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా వేగవంతం అవుతాయని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు, శాశ్వత మౌలిక సదుపాయాల నిర్మాణానికి కూడా దోహదపడుతోందని పేర్కొన్నారు. అదేవిధంగా, ఎండకాలంలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ప్రతి గ్రామపంచాయతీకి బోర్‌వెల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని బోర్‌వెల్స్ తవ్వించి ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి కోసం అవసరమైన పనులను ప్రాధాన్య క్రమంలో అమలు చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగిస్తామని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్, వివిధ గ్రామాల సర్పంచులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మాల హక్కుల కోసం పోరాడిన పి.వి. రావుకు ఘన నివాళులు

**బెల్లంపల్లి, మే 10, ప్రభాతవార్త**

మాల మహానాడు బెల్లంపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్వర్గీయ పి.వి. రావు 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వర్గీకరణకు వ్యతిరేకంగా, మాల సామాజికవర్గ ప్రయోజనాల పరిరక్షణ కోసం పి.వి. రావు మాల మహానాడు అనే సంస్థను స్థాపించి విశేష కృషి చేశారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా వర్గీకరించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఈ వర్గీకరణ వల్ల మాలలకు అన్యాయం జరుగుతుందని భావించి, ఆయన కోర్టుల్లో సుదీర్ఘ న్యాయపోరాటం నిర్వహించారని అన్నారు. 2004లో సుప్రీంకోర్టు వర్గీకరణను కొట్టివేయడంలో ఆయన చేసిన కృషి, అలాగే మాల మహానాడు ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. మరణించే వరకు మాల సామాజిక వర్గ హక్కుల కోసం, అంబేద్కర్ సిద్ధాంతాల వ్యాప్తి కోసం నిరంతరం శ్రమించిన గొప్ప నాయకుడిగా పి.వి. రావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు అంగూరి సుభాష్, ప్రధాన కార్యదర్శి పైడిమల్ల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు గీసా రాజేశం, కోశాధికారి పట్నం చక్రిదర్, కార్యదర్శి పట్టి నవీన్, అంగూరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా ఆదివాసీ నాయకపోడ్ జాతిరత్నం మద్ది రాంచందర్ వర్ధంతి

**జన్నారం, మే 10, ప్రభాతవార్త**

మండలంలోని రాంపూర్ గ్రామ కమాన్ వద్ద ఆదివాసీ నాయకపోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కీర్తిశేషులు మద్ది రాంచందర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మార్నేని భూమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివాసీ అస్తిత్వాన్ని కాపాడి నాయకపోడ్ తెగకు పూల బాటలు వేసిన జాతిరత్నం, నాయకపోడు ముద్దుబిడ్డ మద్దిరాంచందర్‌కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెగ నాయకులు మాట్లాడుతూ, ఆదివాసీ నాయకపోడ్ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి మద్దిరాంచందర్‌ను స్ఫూర్తిగా తీసుకొని వారి ఆశయాల సాధనకై అహర్నిశలు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. నాయకపోడ్ సంస్కృృతి, సాంప్రదాయాలను కాపాడతామని తెగ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సాదం బాపు, జిల్లా ఉపాధ్యక్షులు సాదం చిన్నయ్య, దండేపల్లి మండల అధ్యక్షులు ఏదుల రమేష్, రాజుగూడ గ్రామ అధ్యక్షులు బట్టు రాజయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## కవ్వాల్‌లో కన్నుల పండుగలా పోచమ్మ బోనాలు

**జన్నారం, మే 10, ప్రభాతవార్త**

జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి బోనాల పండుగను కన్నుల పండుగలా ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పోచమ్మ ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్ర ధారణలో బోనాలను తలపై పెట్టుకుని, డప్పు చప్పుళ్లు, కోలాటాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్థులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామంలో పాడి పంటలు సమృద్ధిగా పండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

